సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 24 । నవంబర్ । 2024





**రోడ్డు విస్తరణకు సహకరించాలి**
రోడ్డు విస్తరణ పనులకు రైతులు సహకరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కోరారు.
- 8లో ▸



**కొనుగోలు కేంద్రాల్లోనే..**
లింగంపేట మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాలు నిలిచిపోయాయి. దీంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.7 /11.5

**వాతావరణం**
ఉదయం చలిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

## న్యూస్‌రీల్

### 'డెయిరీ ఎంటెక్ కోర్సు కోసం కృషి చేస్తా'



**కామారెడ్డి అర్బన్ :** కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాలలో ఎంటెక్ కోర్సు కోసం తన వంతు సహకారం అందిస్తానని తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. కామారెడ్డి డెయిరీ కళాశాల డీన్‌గా పనిచేసి గత నెలలో ప్రమోషన్ పొందిన శరత్‌చంద్ర రిజిస్ట్రార్ హోదాలో శనివారం కళాశాలను సందర్శించారు. ఆయనను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర మాట్లాడుతూ డెయిరీ ఎంటెక్ కోర్సు ప్రారంభించడానికి కామారెడ్డి కళాశాలకు అన్ని అర్హతలున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ కేఎస్ ఉమాపతి, అధ్యాపకులు రవీందర్‌రెడ్డి, స్వర్ణలత, మాధవి, శ్రీనివాస్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

### రెజ్లింగ్‌లో రజత పతకం



**పెద్దకొడప్‌గల్ :** జాతీయ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పెద్దకొడప్‌గల్ ఎస్సీ గురుకుల విద్యార్థి సత్తాచాటారు. అండర్–15 కేటగిరిలో విద్యార్థిని లావణ్య రజత పతకం సాధించిందని పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సునీత తెలిపారు. విద్యార్థినితో పాటు అకడమిక్ కోచ్ దాసరి ప్రయాంక, పీఈటీలు సుష్మ, జ్యోతిలను ఆమె అభినందించారు.

### డాటా ఎంట్రీ పరిశీలన



**తాడ్వాయి :** మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న సర్వే డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రోగ్రాం రాష్ట్ర స్పెషల్ ఆఫీసర్ దీప్తి పరిశీలించారు. ఎన్యుమరేటర్లతో మాట్లాడి సర్వే, డాటా ఎంట్రీ తీరును తెలుసుకున్నారు. తప్పులు లేకుండా డాటా ఎంట్రీ జరిగేలా చూడాలని సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఎంఈవో రామస్వామి ఉన్నారు.

### 'కౌలాస్'లో చేప పిల్లల విడుదల



**నిజాంసాగర్(జుక్కల్) :** జుక్కల్ మండలంలోని కౌలాస్‌నాలా ప్రాజెక్టులో శనివారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేశారు. ప్రాజెక్టులో 4.98 లక్షల చేప పిల్లలను విడుదల చేశామని ఎఫ్‌డీవో డోలి సింగ్ తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఫీల్డ్‌మన్ సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

**సదాశివనగర్ :** అడ్లూర్‌ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతోంది. శనివారం నాటికి 30,894 టన్నుల చెరుకు క్రషింగ్ చేశామని ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామన్నారు.

### ఎమ్మెల్సీ ఓటరు జాబితా డ్రాఫ్ట్ విడుదల

**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి :** పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు సంబంధించిన ఓటరు జాబితా ముసాయిదాను శనివారం విడుదల చేశారు. కామారెడ్డి జిల్లాలోని 25 మండలాల్లో 29 పోలింగ్ బూత్‌ల పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 13,993 మంది ఉన్నారు. ఇందులో 9,961 మంది పురుషులు, 4,032 మంది స్త్రీలు ఉన్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 25 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 1,975 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఇందులో 1,280 మంది పురుషులు, 695 మంది స్త్రీలు ఉన్నారు.




# శతాధికం!

పూర్ణాయుర్దాయం అంటే శత వసంతాలని భావిస్తారు. అందుకే పూర్ణాయుష్కులుగా జీవించాలని పెద్దలు శతమానం భవతి అనో.. నిండు నూరేళ్లు అయురారోగ్యాలతో జీవించు అనో దీవిస్తుంటారు. అయితే కొందరు మాత్రమే పూర్ణాయుష్కులుగా ఉంటున్నారు. ఆరోగ్య సమస్యలు, ఇతర కారణాలతో చాలామంది ముందుగానే వెళ్లిపోతున్నారు. కామారెడ్డిలో ఓ పెద్దాయన మాత్రం నూరేళ్ల వయసులోనూ హుషారుగా ఉన్నారు. తన పనులు తానే చేసుకుంటున్న ఆయన ఇటీవలే నూరో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. పూర్ణాయుర్దాయం అనేది భవనాలకూ వర్తిస్తుంది. కామారెడ్డిలో రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం నిర్మించి నూట పన్నెండేళ్లయ్యింది. చెక్కుచెదరకుండా ఉన్న ఈ భవనాన్ని ఇప్పటికీ వినియోగిస్తుండడం గమనార్హం. వందో పుట్టినరోజు జరుపుకున్న వృద్ధుడు.. 112 ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న అతిథి గృహంపై ఈ వారం సండేస్పెషల్.. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

సండే స్పెషల్


తలమడ్ల రాఘవులు

## వందో పుట్టినరోజు జరుపుకున్న రాఘవులు

- అన్ని పనులు సొంతంగా చేసుకుంటున్న పెద్దాయన
- సన్మానించిన బంగారు వర్తక సంఘం


రాఘవులును సన్మానిస్తున్న బంగారం వర్తకులు

తలమడ్ల గ్రామానికి చెందిన రాఘవులు కామారెడ్డి పట్టణంలో ఆరేడు దశాబ్దాల క్రితమే స్థిరపడ్డారు. పట్టణంలో బంగారం వ్యాపారం నిర్వహించడమే కాదు బంగారు వర్తక సంఘానికి సుదీర్ఘకాలం అధ్యక్షుడిగానూ పనిచేశారు. ఆయన హయాంలోనే సంఘ భవన నిర్మాణ పనులు జరిగాయి. ఇప్పటికీ బంగారు వర్తక సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అలాగే పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘానికి అధ్యక్షుడిగానూ పనిచేశారు. ఆయన ఈ మధ్యే శత వసంతాలు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ బంగారు వర్తక సంఘం ప్రతినిధులు ఆయన వందో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి సత్కరించారు. ఆయన ఆరోగ్య రహస్యంపై 'సాక్షి' పలకరించగా అప్పటి కాలంలో ఎలాంటి రసాయనాలు లేని ఆహారం తినే వాళ్లమని చెప్పారు. జొన్నరొట్టె, కూరగాయలు, మాంసాహారం తినేవాళ్లమన్నారు. వ్యవసాయ పనులు కూడా చేసేవాడినన్నారు. తన భార్య లక్ష్మి ఎనిమిదేళ్ల క్రితం చనిపోయిందని తెలిపారు. తన తోడబుట్టిన వాళ్లంతా చనిపోయారన్నారు. మనమలు, మనవరాళ్లు, మునిమనవలు ఉన్నారన్నారు. ఇప్పటికీ సొంతంగానే అన్ని పనులు చేసుకుంటున్నానని తెలిపారు. ఇటీవల కొంత జ్ఞాపకశక్తి తగ్గిందని, కంటి చూపు కూడా దెబ్బతిన్నదని రాఘవులు పేర్కొన్నారు.

## 112 ఏళ్ల అతిథి గృహం

- ఇప్పటికీ వినియోగంలోనే ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న రోడ్లు భవనాల శాఖ అతిథిగృహ నిర్మాణం 1912లో పూర్తయ్యింది. ఈ మధ్య కాలంలో నిర్మిస్తున్న భవనాలు కొంత కాలానికే పగుళ్లు ఇవ్వడం చూస్తున్నాం. కానీ 112 ఏళ్ల క్రితం డంగు సున్నంతో నిర్మించిన ఈ అతిథి గృహం మాత్రం ఇప్పటికీ దెబ్బతినకుండా ఉండడం విశేషం. ఈ భవనంలో ఎంతోమంది ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులు బస చేశారు. రాజధాని నుంచి కామారెడ్డి మీదుగా ఆదిలాబాద్ వరకు ఏ కార్యక్రమానికైనా అప్పటి ఏడో నంబరు జాతీయ రహదారి మీదుగానే వెళ్లేవారు. హైదరాబాద్ నుంచి వెళ్లేటపుడు కామారెడ్డి గెస్ట్ హౌజ్ వద్ద ఆగి, కాసేపు సేదతీరి, అల్పాహారమో.. భోజనమో చేసేవారు. ఒక్కోసారి రాత్రి బస కూడా ఇక్కడే ఉండేది. ఈ గెస్ట్ హౌజ్ వేలాదిమంది వీఐపీలకు ఆశ్రయమిచ్చింది. ఇటీవల కొత్తగా ఆర్అండ్‌బీ అతిథిగృహం నిర్మించారు. అయితే పాత భవనాన్ని తొలగించకుండా రోడ్లు భవనాల శాఖ అధికారులు తమ కార్యాలయాలకు వినియోగించుకుంటున్నారు. అవసరమైన మరమ్మతులు చేయిస్తే మరో ముప్పై ఏళ్ల వరకు దెబ్బతినకుండా ఉంటుందని భావిస్తున్నారు.

## కనుల పండువగా డోలోత్సవం

- కొనసాగుతున్న కాలభైరవుడి జన్మదినోత్సవాలు
- నేడు రథోత్సవం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**రామారెడ్డి :** దక్షిణ కాశీగా పేరుగాంచిన ఇసన్నపల్లి (రామారెడ్డి)లోని శ్రీకాల భైరవ స్వామి ఆలయ కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా 72 గంటలుగా నిర్వహిస్తున్న సంతత ధారాభిషేకం శనివారం ఉదయం ముగిసింది. మధ్యాహ్నం స్వామివారి బంగారు విగ్రహాన్ని బ్యాంకునుంచి ఆలయ ఈవో ప్రభుగుప్తా తీసుకువచ్చారు. అనంతరం బంగారు భైరవుడి విగ్రహాన్ని తొట్టిలో ఉంచి భక్తులు లాలి పాటలు పాడారు. ఈ సందర్భంగా భైరవ నామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. డోలోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**రథోత్సవానికి ఏర్పాట్లు**

ఉత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి ఇసన్నపల్లి, రామారెడ్డి గ్రామాలమీదుగా శోభాయాత్ర నిర్వహిస్తారు. రథం తిరిగి ఆలయానికి చేరుకున్న తర్వాత దక్షయజ్ఞం ఏర్పాటు చేస్తారు.


స్వామివారి విగ్రహాన్ని తీసుకువస్తున్న ఆలయ ఈవో ప్రభు గుప్తా

## ఇబ్బందులు లేకుండా చూస్తాం

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

**దోమకొండ:** సీతారాంపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన కేజీబీవీని సందర్శించారు. ప్రిన్సిపల్ మంగమ్మతో మాట్లాడి శుక్రవారం విద్యార్థినుల ఆందోళనకు కారణాలు తెలుసుకున్నారు. బీబీపేట కేజీబీవీ నుంచి తాత్కాలిక పద్ధతిలో ఇక్కడికి వచ్చిన ఎస్‌వో మంగమ్మ, అటెండర్, ఇద్దరు కుక్‌లను తిరిగి బీబీపేట పంపించాలని విద్యార్థినులు ఎమ్మెల్యేను కోరారు. గతంలో ఇక్కడ పనిచేసిన వారిని తిరిగి రప్పించాలన్నారు. ఈ విషయంపై కలెక్టర్, డీఈవోలతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన వెంట జీసీడీవో సుకన్య, మండల విద్యాధికారి విజయ్‌కుమార్ తదితరులున్నారు.


టీచర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

## మద్నూర్‌కు ఇంటిగ్రేటెడ్ స్కూల్

- త్వరలో స్పోర్ట్స్ స్కూల్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల కూడా వస్తాయి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వ్యాపారులు

**మద్నూర్ :** మద్నూర్‌కు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరయ్యిందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సోమలింగాల గుట్ట సమీపంలో 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం ఎంపిక చేశామన్నారు. వచ్చే నెల పదో తేదీలోపు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తామన్నారు. మద్నూర్ నుంచి సోమలింగాల గుట్ట మీదుగా హండెకేలూర్ గ్రామం వరకు నూతన రోడ్డు వేస్తామన్నారు. నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటుకోసం కూడా కృషి చేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలో రెవెన్యూ డివిజన్, బిచ్కుంద, మద్నూర్‌లను మున్సిపాలిటీలుగా చేయడానికి కృషి చేస్తానన్నారు. మద్నూర్‌లో కాంట్రాక్టర్ స్పందించకపోవడంతో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం కాలేదన్నారు. త్వరలో కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తామన్నారు. వచ్చే సంవత్సరం నాటికి మద్నూర్ మండలం లెండి ప్రాజెక్ట్ నీటితో సస్యశామలం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇంటగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయించిన ఎమ్మెల్యేను మద్నూర్ వ్యాపారులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు హన్మండ్లు స్వామి, రాంపటేల్, సంతోష్ మేస్త్రి, విఠల్ గురూజీ, రమేశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- ఎంపీ సురేశ్ షెట్కార్
- మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్

**కామారెడ్డి క్రైం :** మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎంపీ సురేశ్ షెట్కార్ సూచించారు. ఇందిర మహిళా శక్తి ప్రోగ్రాంలో భాగంగా కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం పక్కన మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేశారు. దీనిని శనివారం ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'అభివృద్ధికి అడ్డుపడుతున్న ఎమ్మెల్యే'

**కామారెడ్డి టౌన్:** కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అడ్డుపడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే తీరుతోనే అన్ని వసతులున్న నియోజకవర్గానికి రావాల్సిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ జుక్కల్‌కు తరలిపోయిందన్నారు. రాష్ట్రంలో 13 నర్సింగ్ కళాశాలలు మంజూరు కాగా అందులో ఒక్కటీ కామారెడ్డికి దక్కకపోవడానికి ఎమ్మెల్యే వైఖరే కారణమన్నారు. ఇతర నియోజకవర్గాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్‌చార్జిలతో కలిసి అభివృద్ధిలో ముందు వరుసలో ఉంటే ఇక్కడ మాత్రం భిన్నంగా ఉందన్నారు. ప్రొటోకాల్ పేరిట రాద్ధాంతం చేయడం సరికాదని ఎమ్మెల్యేకు సూచించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సొంత మేనిఫెస్టో ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, నాయకులు భీంరెడ్డి, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, కారంగుల అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

## అభివృద్ధికి అధికారులు సహకరించాలి

- జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్
- దిశ సమావేశంలో 23 అంశాలపై చర్చ



మాట్లాడుతున్న ఎంపీ సురేశ్ షెట్కార్, వేదికపై కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్, కలెక్టర్ సంగ్వాన్

**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి :** జిల్లా అభివృద్ధికి అధికారులు సహకరించాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ సురేశ్ షెట్కార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పథకాల అమలుకు అధికారులు సహకరించాలని కోరారు. ఆయా అభివృద్ధి పనులకు సంబంధించి ఏ అవసరం ఉన్నా తనతో మాట్లాడాలన్నారు. తాను స్టాండింగ్ కమిటీల్లో సభ్యుడిగా ఉన్నందున కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి ఆయా పనులకు అనుమతులు తీసుకువస్తానని పేర్కొన్నారు.

**వివిధ అంశాలపై..**

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, స్త్రీ శిశుసంక్షేమం, రోడ్లుభవనాలు, మిషన్ భగీరథ, రెవెన్యూ, గృహనిర్మాణం, ప్రజారోగ్యం, మున్సిపల్, వైద్య ఆరోగ్యం, జాతీయ రహదారులు, గనులు, ఉద్యానం, మార్కెటింగ్, నీటిపారుదల, విద్యుత్, గ్రామీణ తాగునీటి సరఫరా, ప్రణాళిక తదితర శాఖలకు సంబంధించిన 23 అంశాలపై దాదాపు రెండున్నర గంటల పాటు సమీక్షించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద 1,47,670 మంది రైతులకు రూ. 531.60 కోట్లు జమ చేశామని అధికారులు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 2,535 పనులను 37.65 లక్షల పని దినాలను గుర్తించి రూ.73 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. జిల్లాలో 1,64,397 మంది లబ్ధిదారులకు వివిధ రకాల పింఛన్ల రూపంలో రూ.36.75 కోట్లు అందించామన్నారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన కింద నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 1,193 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 50,957 మంది చిన్నారులు, 6,689 మంది గర్భిణులు, 5,635 మంది బాలింతలకు అనుబంధ పోషకాహారం అందిస్తున్నామని వివరించారు. ప్రధానమంత్రి ఖనిజ క్షేత్ర కల్యాణ్ యోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ కింద జిల్లాలో రూ.27.38 కోట్లతో 65 పనులను చేపట్టామని, ఇప్పటివరకు 55 పనులు పూర్తయ్యాయని తెలిపారు. జాతీయ రహదారులపై రోడ్డు సేఫ్టీ కింద అండర్ బ్రిడ్జీలు నిర్మిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 1,168 ఇళ్లు మంజూరు చేశామన్నారు. గర్భిణులకు ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని, మందులు అందిస్తున్నామని, రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. మధ్యాహ్న భోజనం కింద రూ. 9.68 కోట్లు ఖర్చు చేసి విద్యార్థులకు భోజనం అందించామని విద్యాశాఖ అధికారి తెలిపారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనం ద్వారా రూ.61.26 కోట్లతో 15 పనులు చేపట్టామని పంచాయతీరాజ్ అధికారులు వివరించారు. దిశ సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మూడు నెలలకోసారి దిశ సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వి.విక్టర్, మున్సిపల్ చైర్మన్లు ఇందుప్రియ, శ్రీకాంత్, గంగాధర్, జిల్లా అధికారులు సురేందర్, రాజారాం, శ్రీనివాస్‌రావ్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

### ముగ్గురు ఎమ్మెల్యేల డుమ్మా

సురేశ్ షెట్కార్ ఎంపీగా ఎన్నికైన తర్వాత తొలిసారి నిర్వహించిన దిశ సమావేశానికి బీజేపీకి చెందిన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాత్రమే హాజరయ్యారు. అధికార పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. రెండున్నర గంటల పాటు సాగిన సమావేశంలో 23 అంశాలపై సమీక్షించారు. అయితే ఎంపీపీల పదవీ కాలం ముగియడంతో సమావేశం బోసిపోయింది. సమీక్ష సందర్భంగా ఆయా అంశాలపై ప్రశ్నించేవారు కరువయ్యారు. కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ నాలుగైదు అంశాలపై ప్రశ్నలు అడిగారు. బాన్సువాడ చైర్మన్ గంగాధర్ రెండు సార్లు అడిగారు.

18వ లోక్‌సభ ఏర్పడిన తర్వాత మొదటిసారి నిర్వహించిన దిశ సమావేశానికి హాజరైన ఎంపీ సురేశ్ షెట్కార్‌ను అధికారులు సన్మానించారు. అలాగే దిశ కమిటీ సభ్యులుగా నియమితులైన కవిత, జాదవ్, నగేశ్, రాజులను సన్మానించారు.


దిశ సమావేశంలో పాల్గొన్న అధికారులు

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం రాశులు


లింగంపేట కొనుగోలు కేంద్రంలో తూకం వేయని ధాన్యం


కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కొద్ది రోజులుగా ధాన్యం తూకం నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.మండలంలోని భవానీపేట, శెట్పల్లి, శెట్పల్లిసంగారెడ్డి, పర్మళ్ల, పొల్కంపేట, భవానీపేట, పోతాయినల్లి, అయిలాపూర్, లింగంపేట తదితర గ్రామాల్లో నేటి వరకు 60 శాతం ధాన్యం తూకం వేసినట్లు సీఈవో తెలిపారు.అలాగే రెండు రోజులుగా తూకం వేసిన ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీలు లోడ్ చేసి రైస్‌మిల్లులకు తరలించినా ధాన్యం అన్‌లోడ్ చేసుకోవడానికి రెండు మూడు రోజులు పడుతుండడంతో తూకం వేసిన బస్తాలు కేంద్రాల్లోనే ఉన్నట్లు రైతులు అంటున్నారు. మరి కొంత మందికి చెందిన ధాన్యం తూకానికి నోచుకోకపోవడంతో రైతులు ప్రతీ రోజూ రాశుల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. లారీల సంఖ్యను పెంచాలని, రైస్‌మిల్లులో అన్‌లోడ్ త్వరగా అయ్యే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటి వరకు 15 కొనుగోలు కేంద్రాల ద్వారా 1982 మంది రైతుల నుంచి 319061 బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్లు సీఈవో పెంటయ్య తెలిపారు. అలాగే 186916 బస్తాలు, 1524 మంది రైతుల వివరాలు ట్యాబ్‌లో ఎంట్రీ చేశామన్నారు.

# రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలి


భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్(జుక్కల్): రోడ్డు విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులతో సబ్ కలెక్టర్ కిరణ్మయి శనివారం మాట్లాడారు. పనులకు సహకరించాలని, ప్రభుత్వ పరంగా పరిహారం అందుతుందన్నారు. బూర్గుల్ గ్రామ శివారులో భూముల సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పాత పహానీలు, రికార్డుల ప్రకారంగా ఉన్న భూములకు అనుమతులు ఇస్తామని చెప్పారు. శనివారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం, నవోదయ విద్యాలయంలో ఇంటింటి సర్వే ఆన్‌లైన్ నమోదును సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను మరింత వేగంతం చేయాలని ఆమె సూచించారు. ధాన్యం తుకంతోపాటు బస్తాల రవాణాకు ట్రాన్స్‌పోర్టు ఇబ్బందులు ఎదురుకాకుండా సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. సబ్ కలెక్టర్ వెంట మహమ్మద్‌నగర్ తహసీల్దార్ సవాయిసింగ్, గిర్దావర్ పండరి తదితరులున్నారు.

## క్లుప్తంగా

### దరఖాస్తు గడువు పొడిగించాలి



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పట్టాలు అందుకునేందుకు దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలని డాక్టరేట్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యం, రమేశ్ కోరారు. ఈ మేరకు వారు శనివారం సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. 2013 నుంచి 2024 వరకు యూనివర్సిటీలో చదివిన వారు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఈ నెల 26తో ముగుస్తున్న గడువును మరో 15 రోజుల పాటు పొడిగించాలని కోరారు.

**25న చలో తెలంగాణ యూనివర్సిటీ**

తెలంగాణ యూనివర్సిటీలో 2013 నుంచి 2024 వరకు చదివిన వారందరికి స్నాతకోత్సవంలో పట్టాలు ఇవ్వాలని ఈ నెల 25న చలో యూనివర్సిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టరేట్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యం, రమేశ్ అన్నారు. సౌత్‌క్యాంపస్‌లో విద్యార్థి సంఘాల నేతలతో వారు మాట్లాడారు. స్నాతకోత్సవంలో పట్టాలు ఇచ్చేలా యూనివర్సిటీ అధికారులపై ఒత్తిడి పెంచడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

### ఇంటిగ్రేటెడ్ పీజీ పరీక్ష ఫీజు చెల్లించాలి

డిచ్‌పల్లి: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఐదేళ్ల పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్స్ పరీక్షల టైంటేబుల్ విడుదల చేసినట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ కోర్సుల్లో (ఏపీఈ, ఐపీసీహెచ్ ) ఐదో, ఏడో, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ ఎగ్జామ్, ఐఎంబీఏ, ఎల్ఎల్‌బీ, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు డిసెంబర్ 5 నుండి 16 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షల ఫీజులను ఈ నెల 28లోగా చెల్లించాలని సూచించారు. అపరాధ రుసుంతో డిసెంబర్ 2 వరకు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

### విండో అధ్యక్షుడిపై నెగ్గిన అవిశ్వాసం



భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామ సింగిల్‌విండో అధ్యక్షుడు కిష్టాగౌడ్‌పై డైరెక్టర్లు ఈ ఏడాది ఏప్రిల్ 4న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన ఫలితాన్ని జిల్లా సహకారశాఖాధికారి రామ్మోహన్ శనివారం వెల్లడించారు. విండో డైరెక్టర్ల సమావేశంలో ఆయన పాల్గొని రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఫలితాన్ని వెల్లడించారు. కిష్టాగౌడ్‌పై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గిందని, కిష్టగౌడ్ తన చైర్మన్ పదవిని కోల్పోయారన్నారు. ఆయన ఇక మీదట డైరెక్టర్‌గా కొనసాగుతారని డీసీవో తెలిపారు.

### చెరుకు తోట దగ్ధం

సదాశివనగర్: సదాశివనగర్‌లో శనివారం ప్రమాదవశాత్తు చెరుకు తోట కాలిపోయింది. గ్రామానికి చెందిన నల్ల రాంరెడ్డి ఎనిమిది ఎకరాలు, పెసరి నారాయణ ఎకరం, పెసరి శేఖర్ ఎకరం చెరుకు తోటతో పాటు డ్రిప్ పైపులు కాలిపోయాయి. కాలిపోయిన చెరుకును ఫ్యాక్టరీ యాజమాన్యం త్వరగా క్రషింగ్‌కు తరలించాలని రైతులు కోరుతున్నారు. ఎకరం విస్తీర్ణంలో కాలిపోయిన డ్రిప్ పైపుల విలువ రూ.40వేల వరకు ఉంటుందని రైతు రాంరెడ్డి తెలిపారు.

# ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె చేస్తాం


డీఈవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల్లో స్పందించకుంటే సమ్మెకు దిగుతామని సమగ్ర శిక్ష ఉద్యోగులు హెచ్చరించారు. శనివారం డీఈవో ఎస్ రాజుకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి 15 రోజుల్లో ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని, తక్షణమే విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్చలు జరిపి తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, రాము, శైలజ గణేశ్, లింగం, శాంభవి, సుప్రియ, అజీమ్, దినేశ్, కాశీదాసు, సాయిరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జన్యుమార్పిడి విత్తనాలను అడ్డుకోవాలి


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి అర్బన్: విత్తనాల్లో జంతు జన్యువులను, కొత్త జీవులను సృష్టించే ప్రక్రియ సాగుతోందని, వీటిని శాకాహారమని పిలవాలో? మంసాహారమని పిలవాలో? అర్థంకాని పరిస్థితి ఏర్పాడబోతోందని భారతీయ కిసాన్‌సంఘ్‌నాయకులు అన్నారు. వాటిరాకను అడ్డుకోవాలని కోరుతూ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. జన్యుమార్పిడి చేస్తున్న కంపెనీలతో ప్రభుత్వ స్థాయిలో సంప్రదింపులు జరపాలని, లోక్‌సభలో చర్చించాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో బీకేఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విఠల్‌రెడ్డి, శంకర్‌రావు, లొంక వెంకట్‌రెడ్డి ఆయా మండలాల ప్రతినిధులున్నారు.

### నీరు కలుషితం కాకుండా చూడండి..



పెద్దకొడప్‌గల్(జుక్కల్): తాగునీరు కలుషితమవుతోందని, దీనిని వెంటనే అరికట్టాలని మండల కేంద్ర వాసులు కోరుతున్నారు. కలుషిత నీరు తాగడంతో వ్యాధుల బారిన పడుతున్నామని, పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బేస్త కాలనీ లీకేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

### ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం



బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శనివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ వేణుగోపాల స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో చేరితో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందన్నారు. అలాగే ఆర్మీ, నేవీ తదితర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీటీవో కృష్ణ, 20మంది కొత్త ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

బాన్సువాడ రూరల్: మహనీయులను ఆదర్శంగా తీసుకుని వారు చూపిన మార్గంలో నడవాలని ఎస్టీ హాస్టల్ వార్డెన్ విజయభారతి అన్నారు. పట్టణంలోని ఎస్టీ బాలికల సంక్షేమ వసతిగృహంలో బిర్సా ముండా జయంతిని శనివారం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విజయలక్ష్మి,శిరీష, సంధ్య, భారతి, బిందు, కవిత పాల్గొన్నారు.

### నేడు గరికిపాటి రాక



బాన్సువాడ : పద్మశ్రీ అవార్డు గ్రహీత, సహస్ర అవధాని గరికిపాటి నరసింహారావు ఆదివారం పట్టణానికి రానున్నారని అయ్యప్ప నిత్యాన్నదాన ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు శంకర్ గురుస్వామి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాట్లను కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. సాయంత్రం 4 గంటలకు గరికిపాటి ప్రవచనం ప్రారంభమవుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు కొత్త కొండ భాస్కర్, మల్లికార్జున్, ర్యాల విఠల్‌రెడ్డి, వీరప్ప, సుధాకర్, మొగులయ్య, సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

### కానిస్టేబుల్‌గా ఎంపికైన యువతికి సన్మానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని వజ్జపల్లి గ్రామంలో కానిస్టేబుల్‌గా ఎంపికై న కె.అశ్వినిని మాజీ సర్పంచ్ ఎర్రం నర్సయ్య, గ్రామస్తులు సన్మానించారు. తమ గ్రామ యువతి కానిస్టేబుల్‌గా ఎంపికకావడం గర్వంగా ఉందన్నారు.మాజీ ఉప సర్పంచ్ ప్రభాకర్‌రావు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చిన్నన్న, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రామారావు, రవీందర్‌రావు, గణేశ్‌రావు, గడీల మహిపాల్‌రావు, దత్తు, ప్రణయ్ రావు,సాయిలు,గంగాధర్,రమేశ్‌రావు పాల్గొన్నారు.

### అద్దె చెల్లించలేదని దుకాణానికి తాళం



కామారెడ్డి క్రైం: ఒప్పందం ప్రకారంఅద్దె చెల్లించకుండా ఎనిమిది నెలలుగా ఇబ్బంది పెడుతున్న దుకాణ యజమాని వైఖరితో విసిగిపోయిన ఇంటి యజమాని దుకాణానికి తాళం వేసిన ఘటన శనివారం రాత్రి కామారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని స్టేషన్‌రోడ్డులో జస్ట్ ఫర్ యూ షాప్ కోసం ఇంటిని అద్దెకు తీసుకున్న సమయంలో షాప్ యజమాని నెలకు రూ.60 వేలు అద్దెకు మాట్లాడుకున్నారు. ఎనిమిది నెలల అద్దె రూ.4.80 లక్షలు ఇవ్వాల్సి ఉందని ఇంటి యజమాని పేర్కొన్నారు. నెలనెలా అద్దె చెల్లించకపోవడంతో జీపీఏ హోల్డర్ మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి షాప్‌నకు తాళం వేశారు. అగ్రిమెంట్‌ను ఉల్లంఘించిన దుకాణ యజమాని వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ‘మహా’ సంబరం

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి ఘన విజయం సాధించడంలో జిల్లాలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు.

–సాక్షి నెట్‌వర్క్


జుక్కల్‌లో పటాకులు కాలుస్తున్న బీజేపీ నాయకులు


బాన్సువాడలో..


నాగిరెడ్డిపేటలో..


ఎల్లారెడ్డిలో..

## క్రీడా సమాచారం

### ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ పోటీలు



కామారెడ్డి టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో అండర్–14 ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ పోటీలను శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 29న హుజురాబాద్‌లో జరిగే స్టేట్ మీట్‌లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రసూల్, స్వామిగౌడ్, మధుసూదన్, ఆంజనేయులు, లక్ష్మణ్, నాగరాజు, నగేష్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక**



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపులో గురుకుల బాలికల కళాశాలకు చెందిన విద్యార్థినులు అండర్ 19 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వెన్నెల (బైపీసీ ఫస్టియర్), మృదుల (ఎంపీసీ ఫస్టియర్) పాల్గొంటారు. విద్యార్థులను ప్రిన్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ సునీత, పీఈటీ సుప్రిత, అధ్యాపకులు అభినందించారు.

**28న ఉమ్మడి జిల్లా అర్చరీ పోటీలు**

దోమకొండ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాస్థాయి సీనియర్ అర్చరీ పోటీలను దోమకొండలోని గడికోటలో ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలని, తమ వెంట పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తెచ్చుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9705141241 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## సంక్షిప్తం

**సెల్ ఫోన్ అప్పగింత**

మాచారెడ్డి: పాల్వంచ మండలం బండరామేశ్వరపల్లి గ్రామానికి చెందిన అంబాల రమేశ్ ఇటీవల తన సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను ఎస్సై అనిల్ శనివారం బాధితుడికి అందజేశారు.

**వాల్ పోస్టర్ల ఆవిష్కరణ**

మాచారెడ్డి: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర విద్యా మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆ సంఘం నాయకులు శనివారం ఘన్‌పూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. డిసెంబర్ 1, 2 తేదీల్లో కామారెడ్డిలో నిర్వహించే విద్య మహాసభలకు విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య, మండల అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు గోపాలకృష్ణ, రాజు, కామారెడ్డి మండల అధ్యక్షుడు పడిగె రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఏసురత్నం, హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సీఐటీయూలో చేరిక**

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలోని శివాజీ బీడీ కంపెనీలో పనిచేస్తున్న చాటన్ బట్టీ కార్మికులు శనివారం సీఐటీయూలో చేరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ కార్మికులకు స్వాగతం పలికారు. నాయకులు కొత్త నర్సింలు, రాజు శ్రీనివాస్, నందగిరి రాజు, భాగ్య, గుర్రాల రాజు తదితరులు పాల్గొన్నారు.

**నేడు దయానంద సరస్వతి బలిదాన దినోత్సవం**

కామారెడ్డి అర్బన్: ఆర్యసమాజం వ్యవస్థాపకులు మహర్షి దయానంద సరస్వతి బలిదాన దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు యజ్ఞ సహిత శోభయాత్ర, భజనలు, ప్రవచనల కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆర్యసమాజ్ ప్రతినిధి అర్వపల్లి రమేశ్ తెలిపారు. ఆర్యనగర్‌లో నిర్వహించే కార్యక్రమానికి ఆర్య బంధువులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

**ఓటరు నమోదు పరిశీలన**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డితోపాటు పలు గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ గంగాసాగర్ శనివారం పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ సాహిత్య, జూనియర్ అసిస్టెంట్ రాజు, బీఎల్‌వో లింగం తదితరులు పాల్గొన్నారు.

**సర్వీస్ బుక్‌లు అందజేత**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు మండల కేంద్రంలోని ఎమార్సీ భవనం వద్ద పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సర్వీస్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి యోసెఫ్, పీఆర్‌టీయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు జూకంటి బాపురెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు గాదారి రాజిరెడ్డి, జిల్లా, మండల బాధ్యులు బసంత్‌రాజ్, సాయిరెడ్డి, బిల్యా, రాజు, హన్మంత్‌రెడ్డి, సహేందర్, నరేందర్, వెంకట్, వీర మహేందర్, సంతోష్, బాల్‌కిషన్ తదితరులు పాల్గొన్నారు.

**పశువులకు చికిత్స**

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని ఇల్చిపూర్‌లో శనివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి 77 పశువులకు చికిత్స చేశారు. ఐదు గేదెలకు కృత్రిమ గర్భధారణ, 21 దూడలకు నట్టల నివారణ మందు వేశారు. పశువైద్యులు రవికిరణ్, రమేశ్, సూపర్‌వైజర్ కృష్ణ, గోపాలమిత్రలు బాలయ్య, శ్రీనివాస్, బాబాగౌడ్, సిబ్బంది మోహిన్, ప్రవీణ్, పాడిరైతులు పాల్గొన్నారు.

**ప్రజాపాలనపై కళా ప్రదర్శన**

భిక్కనూరు: మండల కేంద్రంలో ప్రజాపాలనపై కళాబృందం శనివారం ప్రదర్శన నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల లబ్ధిని ఒగ్గు కథ రూపంలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాకారులు మహేందర్, విఠల్‌రెడ్డి, నాగరాజు, ప్రశాంత్, కాశీరాం, పోశెట్టి, సవిత, లత పాల్గొన్నారు.

**బజరంగ్ దళ్ కమిటీ ఎన్నిక**

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నస్రుల్లాబాద్ ప్రఖండ సంఘటన్ ఎన్నికను శనివారం విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ నిర్వహించారు. బజరంగ్ దళ్ అధ్యక్షుడిగా అరిగె నారాయణ, కార్యదర్శిగా మన్నె శివకుమార్, ఉపాధ్యక్షుడిగా ఆరెళ్ల సునీల్, సభ్యులుగా అంజయ్య, శివసాగర్, రాఘవ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో చందూరి హన్మాండ్లు, కనుకుట్ల శ్రీనివాస్, చరణ్, సాయిలు, మహేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**మోటారు బిగింపు**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం తవ్విన బోరుకు మోటారును బిగించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల భాగయ్య, ఏఎంసీ డైరెక్టర్ ఆస సురేశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు చిందం రాజయ్య, వార్డు మాజీ సభ్యుడు జగ్గ బాల్‌రాజు, మాజీ ఎంపీటీసీ బీరయ్య, రాజేందర్, రూపేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుమ్మరి రాజయ్య, భైరయ్య పాల్గొన్నారు.



## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామ శివారులో స్కూటీ బైక్ ఢీకొన్న ఘటన రాచురి రాకేశ్(30) మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపిన వివరాలు.. శనివారం మధ్యాహ్నం బాబు అనే వ్యక్తి స్కూటీపై ఆర్మూర్ వైపు పిప్రి వెళ్తున్నాడు. ఆర్మూర్‌కు చెందిన రాకేశ్ బైక్‌పై పిప్రి నుంచి వస్తుండగా స్కూటీ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ రాకేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

### చికిత్స పొందుతూ ఒకరు..

దోమకొండ: మండలంలోని అంచనూరు శివారులో ఈ నెల 20న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ భిక్కనూరు మండలం జంగంపల్లికి చెందిన శామర్తి రాజనర్సు(75) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రాజనర్సు తన కుమారుడు బాల్‌రాజ్‌తో కలిసి జనగామ గ్రామానికి వెళ్లి వస్తుండగా కుక్క అడ్డురాగా కిందపడి గాయపడ్డారు. నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజనర్సు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

### ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి..

బీబీపేట: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన యాడారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాడారం గ్రామానికి చెందిన అల్లెపు మల్లయ్య (60) గతంలో నిజామాబాద్‌లో ఉండేవాడు. కొద్ది రోజుల క్రితం గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 22న గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

### అప్పుల బాధతో అటెండర్ ఆత్మహత్య

సదాశివనగర్: అప్పుల బాధతో అటెండర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తండా లింగం(45) తాడ్వాయి తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు ముగ్గురు కూతుర్లుగా ఇద్దరి పెళ్లిళ్లు చేశాడు. వారి పెళ్ళిళ్ల కోసం చేసిన అప్పులు తీర్చేదెలా అని మనస్తాపం చెంది గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రంజిత్ తెలిపారు.

### ప్రభుత్వ భూమి ఆక్రమించిన 13 మందిపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సర్వే నంబర్ 249లో 1,581 గజాలను 14 మంది ఆక్రమించుకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో నార్త్ తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిలో చౌదరి, హైదర్, సమి, దావూద్, ఇమ్రాన్, ఫయాజ్, మునలాబ్, ముజీబ్, షేక్ అహ్మద్, హైమద్ మేస్రీ, సాహెబ్, వాజీద్, ఆజీమ్ ఉన్నారు. తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు 13 మందిపై కేసు నమోదు చేసినప్పటీ వివరాలను గోప్యంగా ఉంచారు. దీనిపై సౌత్ సీఐ సురేశ్‌ను వివరణ కోరగా 15 రోజుల క్రితం తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### చెక్‌పోస్ట్ దహనం చేసిన వ్యక్తి అరెస్ట్

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల శివారులోని రెవెన్యూ చెక్‌పోస్టును కాలబెట్టిన నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రుద్రూర్ సీఐ కృష్ణ, కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. మంజీర నుంచి ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి కొడిచర్ల శివారులో నెల రోజుల క్రితం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ నెల 18న సిబ్బంది లేని సమయంలో దుండగులు చెక్‌పోస్టుకు నిప్పంటించారు. దీనిపై తహసీల్దార్ మల్లయ్య కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కామారెడ్డి జిల్లా దోంగ్లీ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన షేక్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడు నేరం అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

**హత్యాయత్నం కేసులో ఒకరి రిమాండ్**

నవీపేట: నవీపేటలోని దర్యాపూర్ కాలనీలో ఈ నెల 18న జరిగిన హత్యాయత్నం కేసులో శనివారం ఒకరిని రిమాండ్‌చేసినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని షేక్ సోహేల్‌పై షేక్ గౌస్ కత్తితో దాడి చేశారని పేర్కొన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు గౌస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

# పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

- భయంతో ఆత్మహత్య చేసుకున్న మరో నిందితుడు

భిక్కనూరు: భిక్కనూరు మండలం కంచర్ల గ్రామంలో ఈనెల 20న హత్యకు గురైన మహిళ కేసులో ఒక నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కంచర్ల గ్రామానికి చెందిన సుగుణను హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆధ్వర్యంలో సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్ కేసు దర్యాప్తు ప్రారంభించారు. బీబీపేట మండలం యాడారం గ్రామానికి చెందిన ఇద్దరు హత్య చేసినట్లు గుర్తించినట్లు తెలిసింది. ఈ మేరకు ఒక నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి భయంతో పురుగుల మందు తాగినట్లు సమాచారం. కాగా సదరు వ్యక్తి చికిత్స పొందుతూ కామారెడ్డి ఆస్పత్రిలో మృతి చెందినట్లు తెలిసింది.